భూ హక్కు పత్రాల పంపిణీ పారదర్శకంగా ఉండాలి : జెసి

భీమవరం : భూ హక్కుపత్రాల పంపిణీలో అవకతవకలు లేకుండా, పారదర్శకంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై రెవెన్యూ అధికారులతో, సిబ్బందితో జెసి సమీక్షించారు. భూమిని అమ్మిన కేసులకు సంబంధించి భూమిని కొనుగోలు చేసిన వారికే భూ హక్కు పత్రాలను అందజేయాలని సూచించారు. వారితో మ్యుటేషన్లకు దరఖాస్తు చేయించి ఇకపైన ఆన్‌లైన్ ద్వారా మార్పును చేయాలని సూచించారు. పేదలకు స్థలాలు కేటాయించిన చోట ఇళ్ల పట్టాలు పొందడానికి సుముఖంగా లేని వారి కారణాలను పొందుపరచి సమర్పించాలన్నారు. ఇళ్ల పట్టాలకు అవసరమైన భూమిని గుర్తించే ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. శ్మశానవాటికలకు స్థల కేటాయింపులో తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అభ్యంతరం ఉన్న పోరంబోకు స్థలాలకు ప్రత్యామ్నాయంగా వేరే స్థలాలను గుర్తించాలన్నారు.

లస్కర్లకు జీతాల్లేవ్..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలోని పంటలకు సాగునీరు సరఫరాలో కీలకపాత్ర పోషిస్తున్న కాలువలపై పనిచేసే లస్కర్ల గురించి పట్టించుకునే వారే లేకుండా పోయారు. పది నెలలుగా జీతాలు ఇవ్వకపోయినా అడిగే నాథుడే కనిపించడం లేదు. స్వయంగా ముఖ్యమంత్రిని కలిసి తమ గోడు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో లస్కర్లు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా డెల్టా పరిధిలో 5.29 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. గోదావరి నుంచి కాలువల ద్వారా వచ్చే నీటిని స్వయంగా పంపిణీ చేసేందుకు కాలువలపై లస్కర్లను ప్రభుత్వం నియమిస్తోంది. ముఖ్యంగా రబీలో నీటి ఎద్దడి సమయంలో లస్కర్లు ముఖ్య పాత్ర పోషిస్తుంటారు. రాత్రీ, పగలు తేడా లేకుండా కాలువల వద్ద వారు పనిచేస్తారు. ప్రతీ లస్కర్ పరిధిలో ఐదువేల ఎకరాల ఆయకట్టు ఉంటుంది. ప్రతిరోజు కాలువలపై దాదాపు 50 కిలోమీటర్లు తిరగాల్సి ఉంటుంది. వ్యవసాయ సాగులో ఇంతటి కీలక పోషిస్తున్న వీరికి సకాలంలో జీతాలిచ్చే పరిస్థితి లేకపోవడం బాధకరం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 194 మంది వరకూ లస్కర్లు కాలువలపై పనిచేస్తున్నారు. వీరికి గడిచిన పది నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో లస్కర్ల కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో తమకు ప్రతినెలా ఒకటోతేదీన జీతం ఇవ్వండి మహాప్రభో అంటూ లస్కర్లు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు.

ఏడాదంతా పని.. పదినెలలకే జీతం

కాలువలపై పనిచేసే లస్కర్లకు ఏడాదిలో పది నెలలకే జీతాలు ఇస్తున్నారు. జూన్ ఒకటో తేదీన కాలువలకు నీరు విడుదల చేస్తే ఏప్రిల్ 25వ తేదీ వరకూ కాలువలకు సాగునీరు విడుదల కొనసాగుతుంది. మే నెలలో క్లోజర్ పనుల నిమిత్తం లస్కర్లతో పని చేయించుకుంటున్నారు. కానీ జూన్ నుంచి మార్చి నెలలకు మాత్రమే జీతాలిస్తున్నారు. ఏప్రిల్, మేనెలలో పనిచేయించుకున్నా జీతాలు మాత్రం ఇవ్వడం లేదు. అదేమని అడిగినా సమాధానం చెప్పేవారే లేకుండా పోయారు. లస్కర్లకు నెలకు రూ.10,500 వేతనం మాత్రమే ఇస్తున్నారు. 2017 నుంచి ఇదేజీతం లస్కర్లు అందుకుంటున్నారు. ధరలు విపరీతంగా పెరిగినా లస్కర్ల జీతాల్లో మాత్రం మార్పు లేకుండా పోయింది. సమాన పనికి సమానవేతనం ఇవ్వాలంటూ లస్కర్లు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకకోవడం లేదు. తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేకపోవడంతో లస్కర్లు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

- పది నెలలుగా అందని పరిస్థితి
- డెల్టాలో సాగునీటి పంపిణీలో కీలకపాత్ర వీరిదే
- ఒక్కో లస్కర్ పరిధిలో ఐదు వేల ఎకరాల ఆయకట్టు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 197 మంది లస్కర్ల అవస్థలు
- ఏడాదంతా పనిచేసినా పది నెలలకే వేతనాలు
- ముఖ్యమంత్రిని కలిసినా ఫలితం శూన్యం

దెందులూరు మండలంలోని పంట కాలువ

సిఎంను కలిసినా ప్రయోజనం శూన్యం

తమకు జీతాలు సకాలంలో చెల్లించాలంటూ లస్కర్లంతా నవంబర్ 21వ తేదీన నరసాపురం పర్యటనకు విచ్చేసిన సిఎంను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇది జరిగి దాదాపు మూడునెలలు కావొస్తోంది. ఇప్పటి వరకూ కనీస చర్యలు సైతం లేకుండా పోయాయి. సిఎం దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో లస్కర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అసలు జీతాలు ఇస్తారా అన్న అనుమానం సైతం నెలకొంది. జనవరి 20వ తేదీ తర్వాత వంతుల వారీ విధానం అమల్లోకి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. వంతుల వారీ విధానంలో పంటలకు సక్రమంగా నీరందించడంలో లస్కర్లదే కీలక పాత్ర. జీతాలు లేకుండా ఆకలిబాధలతో విధులు ఏ విధంగా నిర్వహించాలో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. వెంటనే లస్కర్లకు జీతాలు విడుదల చేసి ఆర్థిక కష్టాలు తొలగించాల్సి ఉంది.

జిఒ 1 అప్రజాస్వామికం

జిల్లాలో కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

జిఒ నెం.1ని రద్దు చేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్, పౌర హక్కుల సంఘం, పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తణుకు నరేంద్ర సెంటర్‌లో జిఒ కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం ప్రదర్శనగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పౌరుల ప్రాథమిక హక్కులను హరించే విధంగా జిఒ1 ఉందని, దీన్ని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడుకోవడానికి సమావేశాలు, సభలు ఏర్పాటు చేసుకోవడానికి రాజ్యాంగం ప్రాథమిక హక్కులను ఆర్టికల్ 19 నుంచి 22 వరకూ కల్పించిందన్నారు. ప్రభుత్వాలు అధికారంలోకి రాకముందు ప్రజలే దేవుళ్లని, ప్రజలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తామని వాగ్దానాలు చేస్తూ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మరిచిపోయి ప్రజల హక్కులను హరించి, వారి హక్కులపై దాడి చేసే విధంగా జిఒలను తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఎన్నికలు దగ్గర పడేకొద్ది ప్రభుత్వం భయపడుతూ ప్రజలను మాట్లాడుకోకుండా, సభలు పెట్టుకోకుండా ఏదో సాకులు చెబుతూ చట్ట వ్యతిరేక తప్పుడు జిఒలను తీసుకొచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ప్రజల కోసం పనిచేయాలి గానీ, వారిసొంతం కోసం పనిచేయరాదన్నారు. సిఎం జగన్ ఎన్నికల ముందు ప్రచారం కోసం ఇరుకు సందుల్లోనూ, ఇరుకు రోడ్లపైన ప్రచారం చేశారని, ఇప్పుడు ఆ విధంగా చేయరాదని జిఒలు తీసుకురావడం దెయ్యాలకు వేదాలు నేర్పినట్లు అవుతుందన్నారు. సభల దగ్గర పోలీసులు చేత సెక్యూరిటీ ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైతే అది ప్రజల తప్పా అని వారు ప్రశ్నించారు. గతంలో అనేక విధాలుగా జనాలు చనిపోతే దానికి కారణాలు సభలో సమావేశాలని మాట్లాడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి తణుకు పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొమ్మి రాంబాబు, టి.మారుతీరావు, పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు కౌరు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి డి.రామకృష్ణ, సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, సిపిఎం నాయకులు పివి.ప్రతాప్, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి మురళీ, ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి, న్యాయవాదులు గొల్లపల్లి అంబేద్కర్, వి.పురుషోత్తం, గుబ్బల శ్రీనివాసరావు, బళ్ల చిన్న వీరభద్రం, గ్రంధి రామకృష్ణ, అజయ్‌కుమారి, నాగరత్నం, జి.రంగారావు, బండి సత్యనారాయణ, గుబ్బల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..


తణుకులో..

పెనుగొండ : జిఒ1ని తీసుకువచ్చి ప్రజల గొంతు నొక్కాలని చూస్తుందని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం జిఒ కాపీలను దహనం చేశారు. ప్రజాస్వామ్యానికి భంగవాటిల్లేలా సభలు, సమావేశాలు జరపకూడదని, ఏకపక్షంగా నిరంకుశంగా జిఒను తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఈ జిఒను ఉపసంహరించకపోతే రానున్న కాలంలో ప్రజల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రాల సత్యనారాయణ, నీలాపు ఆదినారాయణ, మాదాసు నాగేశ్వరరావు, ఆవుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : జిఒ నెం.1 రద్దు చేయాలని కోరుతూ తాడేపల్లిగూడెం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ ఐల్యాండ్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు రాష్ట్ర కమిటీ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, పట్టణ కమిటీ నాయకులు గొన్నాబత్తుల నాగేశ్వరరావు మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించడంతోపాటు అవసరమైన సందర్భాల్లో నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించిందని, ఈ హక్కును హరించే విధంగా ప్రజల గొంతు నొక్కి వైసిపి ప్రభుత్వం జిఒ1ని తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే ప్రశ్నించేవారిపై నిర్బంధాలు చేస్తున్నారని, బహిరంగ సభలు, ర్యాలీలు, నిరసనలు చేపట్టడమంటే ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడమేనని వారు తెలిపారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలను నేడు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, రాష్ట్రంలో ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ నియంతృత్వంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో జి.నాగేశ్వరరావు, జవ్వాది శ్రీను, చిటికిన రాము, టి.పెద్దిరాజు, పి.పైడియ్య, పి.శ్రీనివాస్, ఎస్.శేషుబాబు, పి.నాగేంద్రబాబు, వి.అప్పారావు, రామోహనరావు, ఎన్.నారాయణరావు పాల్గొన్నారు.

సూర్యనారాయణరాజు ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - యలమంచిలి

చించినాడ గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ సర్పంచి రుద్రరాజు సూర్యనారాయణ రాజు 17వ వర్థంతి సభ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు అధ్యక్షత వహించారు. ఈ సభలో సిపిఎం సీనియర్ నాయకులు కేతా సూర్యరావు మాట్లాడుతూ చించినాడలో పార్టీ ఆధ్వర్యంలో సుమారు 60 సంవత్సరాల పాటు ఏకధాటిగా పంచాయతీ, సొసైటీలో ఎర్రజెండా పక్షాన పరిపాలన కొనసాగిందని, ఇందులో సూర్యనారాయణరాజు ఒక్కరే 30 సంవత్సరాల పాటు సర్పంచిగా పనిచేసి మచ్చలేని నాయకునిగా గ్రామంలో చిరస్థాయిగా నిలిచారన్నారు. అనేక అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించి అందరి హృదయాల్లో జరగని ముద్ర వేశారని, అలాంటి నాయకుని ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా సూర్యనారాయణ రాజు విగ్రహానికి పెద్ద వర్మ, విశ్వనాథరాజు, చిన్న వర్మ, వైజాగ్‌రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. స్తూపంపై జెండాను సీనియర్ నాయకులు కేతా సూర్యారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు రుద్రరాజు పెదవర్మ, రుద్రరాజు సత్యనారాయణరాజు (వైజాగ్ రాజు), రుద్రరాజు చిన్న వర్మ, రుద్రరాజు పెదబాబు, రుద్రరాజు బాలకృష్ణంరాజు, అల్లూరి రామకృష్ణంరాజు, సిపిఎం నాయకులు దేవ సుధాకర్, సరిపల్లి జయప్రభ, జిల్లెళ్ల ప్రశాంతి, మురాలా ఝాన్సీ, గొల్ల ఏడుకొండలు, చెల్లుబోయిన వడ్డీకాసులు, సెట్టిమి నాగమణి, ముస్కుడి జయశ్రీ, బొల్లా నరసింహమూర్తి, విప్పర్తి నన్ని, విప్పర్తి నాని, మురాల రత్నప్రసాద్, ముమ్మిడివరపు ఆంజనేయులు, సెట్టిమి భాస్కరరావు పాల్గొన్నారు.


సూర్యనారాయణరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, ప్రముఖులు

యువత క్రీడల్లో రాణించాలి : ఎస్ఐ

దుంపగడపలో డివైఎఫ్ఐ ఆధ్వర్యాన క్రీడలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆకివీడు

దశాబ్దాల తరబడి డివైఎఫ్ఐ నిర్వహిస్తున్న క్రీడలు యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని ఎస్ఐ కె.రాజారెడ్డి అన్నారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భీమవరం కైకలూరు నియోజకవర్గాలస్థాయి క్రికెట్ పోటీలు సోమవారం దుంపగడప ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో ఎస్ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్ జెండా ఎగరవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్ఐ క్రీడలు యువతకు స్ఫూర్తితో పాటు మంచి భవిష్యత్తును కూడా అందిస్తాయన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం మంచి రిజర్వేషన్లు అందిస్తోంన్నారు. వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుజాత మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తూ మట్టిలో మాణిక్యాలను వెలుగులోకి తెస్తున్నారని అభినందించారు. క్రికెట్ బౌలింగ్‌ను ప్రారంభించిన మాజీ ఎంపిటిసి సభ్యులు అంబటి రమేష్, దుంపగడప ప్రభుత్వ కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి నంబూరి రామరాజు (బాబు) మాట్లాడుతూ యువతకు దేశభక్తి నూరిపోస్తూ భగత్ సింగ్ అల్లూరి సీతారామరాజు మార్గాల్లో పయనించడంలో డివైఎఫ్ఐ ముందు వరుసలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ యువత లోకల్ రవితేజ, బొడ్డుపల్లి రాంబాబు, సబ్బాని కార్తీక్, సందక సూరిబాబు, గూడూరి రామకృష్ణ, నౌకోట్ల చైతన్య, బొక్కా వర్మ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ రాజారెడ్డి

స్పందన సమస్యలు త్వరగా పరిష్కరించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ మురళీ

ప్రజాశక్తి - భీమవరం

ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా స్పందన సమస్యలు త్వరతగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి మురళి అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజల నుంచి వచ్చిన 168 వినతులను జెసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించే విధంగా జిల్లా, మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో అందిన అర్జీలను రీ ఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి దాసిరాజు, డిపిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ పాల్గొన్నారు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న జెసి మురళి

వైసిపి పేదల ప్రభుత్వం : మంత్రి కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాబోయే ఎన్నికల్లో పేదలకు పెత్తందార్లకు మధ్య యుద్ధం జరగబోతోందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. అధికార వైసిపి పేదల పక్షాన పనిచేస్తుంటే ప్రతిపక్షాలు టిడిపి, జనసేన పార్టీలు పెత్తందారుల పక్షాన పనిచేస్తున్నాయన్నారు. సోమవారం తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో కొత్తగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు మంత్రి కొట్టు సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ నూరుశాతం రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేస్తోందన్నారు. తమది పేదల ప్రభుత్వమన్నారు. తెలుగుదేశం, జనసేన చూసి ఓర్వలేకపోతున్నాయన్నారు. పవన్ విధానాలతో జనసేన కార్యకర్తల్లో ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. అనంతరం తాడేపల్లిగూడెం మండలంలో కొత్తగా మంజూరైన 362 పెన్షన్లను లబ్ధిదారులకు మంత్రి అందజేశారు.

12 ఎకరాల్లో క్రికెట్ స్టేడియం

తాడేపల్లిగూడెంలో 12 ఎకరాల విస్తీర్ణంలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటికే తాడేపల్లిగూడెం మెయిన్ రోడ్డును పెంటపాడు మిడ్ లెవెల్ కెనాల్ నుండి వెంకట రామన్న గూడెం హార్టికల్చర్ యూనివర్సిటీ వరకు నాలుగు లైన్ల రహదారిగా రూ.41 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశామన్నారు. పెద్ద తాడేపల్లి, వెంకట రామన్నగూడెం గ్రామాల పరిధిలో సిమెంట్ రోడ్డు నిర్మించామన్నారు. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఎదురుగా వైఎఆస్ఆర్ యోగ ముద్రలో ఉన్న విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. తాడేపల్లిగూడెంలో 12 ఎకరాల్లో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, ఎంపిపి పి.శేషులత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తోందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. సోమవారం ఆచంట వేమవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి గ్రామంలో జరిగిన సంక్షేమ అభివద్ధిని వివరించి, గ్రామంలోని ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా గడపగడపకూ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోమని ఆదేశించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ ఒక్కరే అని అన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దళిత బడుగు బలహీన వర్గాల అగ్రవర్ణ నిరుపేదలకు ఆర్థికంగా నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. టిడిపి పాలనలో కేవలం ఐదుగురు ఉద్యోగులతో మాత్రమే పంచాయతీ పాలన ఉండేదన్నారు. నేడు వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సచివాలయ వ్యవస్థ ద్వారా సుమారు 16 మందితో గ్రామంలో సుపరిపాలన తో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచి జక్కంశెట్టి చంటి, సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, ఉపసర్పంచి కొండేటి సురేష్ పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

రెడ్‌క్రాస్ సొసైటీకి రూ.1.67 లక్షల విరాళం

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధి హామీ పథకం భీమవరం, తణుకు క్లస్టర్‌లో పనిచేస్తున్న సిబ్బంది రూ.లక్షా 67 వేలు విరాళాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి సోమవారం అందజేశారు. కాళ్ల మండలంలో రూ.20,100, భీమవరం రూ.14,200, ఆకివీడు రూ.12,450, నరసాపురం రూ.10,650, మొగల్తూరు రూ.8900, పాలకోడేరు రూ.8250, యలమంచిలి రూ.8,050, ఉండి రూ.7450, వీరవాసరం రూ.6,000, పాలకొల్లు రూ.1,800, తణుకు క్లస్టర్‌లోని మండలాల నుంచి రూ.67 వేలు, భీమవరం క్లస్టర్ కార్యాలయం నుంచి రూ.2,150 మొత్తం రూ.లక్షా 67 వేలు మొత్తాన్ని భీమవరం క్లస్టర్ ఎపిడి వి.విజయ లక్ష్మి, ఇసికె. శ్రీనివాస్, జెఇ ఆనంద్ వివిధ మండలాల టిఎలు, సిఒలు డ్వామా సిబ్బంది, డ్రామా పీడీ రాజేశ్వరరావు అందజేశారు.


రెడ్‌క్రాస్ సొసైటీకి విరాళం అందజేస్తున్న సిబ్బంది

12న మాంటిస్సోరీలో యూత్ ఫెస్ట్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు లజపతిరాయ్‌పేట మాంటిస్సోరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అండ్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 12న వివేకానంద స్వామి జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం, యూత్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కెవి కృష్ణవర్మ తెలిపారు. ఈ యూత్ ఫెస్ట్‌లో పాలకొల్లు పరిసర ప్రాంతాలకు సంబంధించిన అన్ని తెలుగు, ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు డాన్స్, మ్యూజిక్, స్కిట్స్, మైమ్స్, మ్యూజిక్ ఇన్స్ట్రుమెంటల్ ప్లే తదితర పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు బహుమతులు అందజేసామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఈ పోటీల్లో పాల్గొనేవారు ఈనెల 11వ తేదీ బుధవారం మాంటిస్సోరీ స్కూల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

హామీల అమలు జగన్‌కే సాధ్యం : ఎంఎల్ఎ గ్రంథి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయంలో రాష్ట్రంలో స్వర్ణ యుగం నడుస్తోందని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ముగిసి సోమవారానికి నాలుగు సంవత్సరాలైన నేపథ్యంలో స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ కేక్‌కట్ చేశారు. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో జగన్మోహన్‌రెడ్డిని మించిన నాయకులు లేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్, మైనార్టీ సెల్ ఛైర్మన్ మేడిది జాన్సన్, ఎంపిపి పేరిచర్ల విజయ సింహరాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, కొప్పర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు టెస్ట్ పేపర్లు అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ ఆధ్వర్యాన..
పది విద్యార్థులకు టెస్ట్ పేపర్లు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు మార్కండేయులు అన్నారు. మండలంలోని ఎల్‌బి.చర్ల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం యుటిఎఫ్ మండల శాఖ సబ్ కమిటీ మెంబర్ బిఎల్‌జె.గాంధీ తన తండ్రి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం 10వ తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో తయారు చేసిన మోడల్ టెస్ట్ పేపర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కండేయులు మాట్లాడుతూ ఈ మెటీరియల్ మేధావులు తయారుచేశారని, పరీక్షలకు సన్నద్ధమౌతున్న ఈ తరుణంలో ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.మార్కండేయులు, మండల అధ్యక్షులు ఎన్‌వి.సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి ఎస్.అజయ్‌కుమార్, కార్యదర్శి బిఎల్‌జె.గాంధీ, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రాండ్ కంట్రోల్ పాయింట్స్ పరిశీలిస్తున్న అధికారులు

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం : తహాశీల్దార్

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహాశీల్దార్ షేక్ హుస్సేన్ అన్నారు. పాలకోడేరులో సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రౌండ్ కంట్రోల్ పాయింట్స్ (డ్రోనపై సర్వే చేసే) కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేను ఇప్పటికే ప్రారంభించడం జరిగిందని, దీనిలో నూతన విధానం ద్వారా గ్రాండ్ కంట్రోల్ పాయింట్స్ నమోదు చేసేందుకు ప్రభుత్వం అధునాతన టెక్నాలజీని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ సర్వేను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని అధికారులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహాశీల్దార్ సూర్యనారాయణరాజు, ఆర్ఐ నాగభూషణరావు, మండల సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - పెనుమంట్ర

నెహ్రూ యువ కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, వారధి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో యువ నాయకత్వ శిక్షణా కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ బాస్కెట్ బాల్ ప్లేయర్, నరసాపురం బస్ డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సుబ్బన్న రెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వమే కాకుండా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించొచ్చని, తద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అందుకోవచ్చని తెలిపారు. అనంతరం మార్టేరులోని రీజినల్ అగ్రికల్చర్ రీసెర్చ్‌ను ఫీల్డ్ విజిట్ జిల్లా యువ అధికారి దూలం కిషోర్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. దూలం కిషోర్ మాట్లాడుతూ మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని ఉపయోగించుకున్న యువ నాయకులందరూ భవిష్యత్తులో జీవితంలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వతేజ కళాశాల ప్రిన్సిపల్ పులిగెడ్డ శ్రీనివాస్, కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ ఎం.నాగబాబు, వారధి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు కామాక్షి రవి, కార్యదర్శి కడలి సత్యనారాయణ, నెహ్రు యువ కేంద్ర వాలంటీర్లు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు అందిస్తున్న ఎఒ మద్దాల జయదుర్గా మాధురి

ఆర్‌బికెల్లో ఎరువులు : ఎఒ

ప్రజాశక్తి - పెనుమంట్ర

నెగ్గిపూడి, మార్టేరు, వెలగలేరు రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎఒ మద్దాల జయ దుర్గామాధురి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె రైతు భరోసా కేంద్రం ద్వారా ఎరువులను రైతులకు అందజేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. సత్యవరంలో పొలాలను పరిశీలించారు. రైతులు వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారన్నారు. నారుమడి తీసేటప్పుడు వరి నారు కొనలను తుంచి నాటాలని తెలియజేశారు. ఇలా నారు కొనలను తుంచడం వల్ల కాండం తొలుచు, ఆకుముడత పురుగులు గుడ్ల సముదాయం తీసేయొచ్చని తెలిపారు. అలా తీయడం వల్ల ప్రధాన పొలంలో నాటిన 25 రోజుల వరకు ఏ విధమైనటువంటి పురుగు మందులు పిచికారీ చేయనవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు , రైతు నాయకులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన భర్త మృతి
భార్య పరిస్థితి విషమం

ప్రజాశక్తి - మొగల్తూరు

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరం గ్రామీణ మండలం శ్రీరామపురం గ్రామానికి చెందిన ఆకుల ఆమోషు (23), సునీత దంపతులకు ఐదు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 8న ఇరువురు పురుగుల మందు తాగారు. వారిని చికిత్స నిమిత్తం మొగల్తూరులోని ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమోషు సోమవారం మృతి చెందాడు. సునీత పరిస్థితి విషమంగా ఉంది. దీనికి సంబంధించి ఆయన మేనమామ సన్నిమండ పెద్దిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సాంప్రదాయబద్ధంగా సంక్రాంతి జరుపుకోవాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - పెనుమంట్ర

సంక్రాంతి పండుగను సాంప్రదాయ బద్ధంగా మాత్రమే జరుపుకోవాలని ఎస్ఐ బి.సురేంద్రకుమార్ అన్నారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, విఆర్ఒలకు, మహిళా పోలీసులకు, సచివాలయ సిబ్బందికి సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు, అసాంఘిక కార్యక్రమాల నిరోధించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటా మండలంలోని మాముడూరు, జుత్తిగ, నత్తారామేశ్వరం, ఆలమూరు, మార్టేరు వంటి గ్రామాల్లో కోడిపందేల నిర్వాహకులకు నోటీసులు పంపించామన్నారు. ఎక్కడైనా కోడి పందేలు, పేకాట, గుండాట వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎప్పటికే మండలంలో 79 మందిపై 34 బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కోడిపందేలు స్థావరాల వద్ద నిషేధిత బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దండు అశోక్‌వర్మ, ఎంపిడిఒ బి.పూర్ణబబ్జి, తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు

ఉండి : ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ కె.గంగాధర్ అన్నారు. చెరుకువాడలో సోమవారం జూద క్రీడల నిషేధంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో కోడి పందేలు, గుండాట, పేకాట వంటి జూద క్రీడలు నిర్వహించరాదన్నారు. సంక్రాంతి సమయంలో వివిధ సాంస్కతిక క్రీడలను ప్రోత్సహించి పండుగను ఆహ్లాదకరంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావు, అర్తమూరు గ్రామ సర్పంచి గొనబోయిన వీర్రాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి కేశిరెడ్డి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఐ సురేంద్రకుమార్

మొగల్తూరు: మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపడితే అధికారులకు సమాచారం ఇవ్వాలని తహశీల్దార్ జి.అనితకుమారి సూచించారు. సోమవారం మొగల్తూరు లోని మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది ,మహిళా పోలీసులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎక్కడైనా బరులు ఏర్పాటు చేస్తే సమాచార ఇవ్వాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు: మాట్లాడుతున్న తహశీల్దార్

కొడమంచిలిలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పెనుగొండ సిఐ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కొడమంచిలి హైస్కూల్‌లో వాలీబాల్ టోర్నమెంట్‌ను సిఐ ప్రారంభించి మాట్లాడారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కొడమంచిలిలో క్రీడలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో యువకులు కోడిపందేలు, జూదాలు, పేకాట వైపు దృష్టి మరలకుండా ఉండేందుకు ఇటువంటి క్రీడలు ఎంతో దోహద పడతాయన్నారు. ఆచంట ఎస్ఐ బిఎస్ డిఆర్ ప్రసాద్ మాట్లాడుతూ శారీరక దారుఢ్యం, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, ఎన్.చందు, ప్రధానోపాధ్యాయులు డి.రాంబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు చిరంజీవి పాల్గొన్నారు.

కేరళాలో జరుగుతున్న ఐద్వా జాతీయ మహాసభలో మన రాష్ట్ర ప్రతినిధుల గ్రూపు చర్చల్లో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పి.పూర్ణ

12 నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ ఏడాది సంక్రాంతిని పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీ నుంచి మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి పురుషులు, మహిళల విభాగంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు తెలిపారు. సోమవారం మండల పరిషత్ సమావేశం మందిరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను యనమదుర్రులో నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులకు అన్ని సదుపాయాలూ కల్పిస్తున్నట్లు చెప్పారు. పోటీలో మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండవ బహుమతిగా రూ.30 వేలు, మూడవ బహుమతిగా రూ.20 వేలు అందజేస్తున్నామన్నారు. అలాగే వీక్షించడానికి వచ్చే వారి వాహనాల పార్కింగ్ కు ఇబ్బంది లేకుండా ప్రత్యేక స్థలం కేటాయించామన్నారు. ఈ సమావేశంలో సర్పంచులు చిల్లే వెంకటేష్, కోళ్ల బాలకృష్ణ, బూరాబత్తుల శ్రీరామ్మూర్తి, తిరుమాని ధనుంజయ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

ప్రజాశక్తి - పోడూరు

సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పోడూరు జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు పిలుపునిచ్చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఎంపిపి సబ్బితి సుమంగళి సాగర్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో జెడ్‌పిటిసి పెద్దిరాజు మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లోనూ జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులు పక్కా ఇల్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపిపి సుమంగళి సాగర్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయని విధంగా సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అర్హులైన వారందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా వర్తించేలా ప్రజాప్రతినిధులు అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సర్పంచులు, ఎంపిటిసిలు చెప్పిన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపిటిసి పోడూరి నాగరాజారావు మాట్లాడుతూ పోడూరు గ్రామానికి ఆర్‌టిసి బస్ సర్వీసు నడిపాలని, కవిటం లాకుల వద్ద స్టాప్ పెట్టాలని అధికారులను కోరారు. కొత్త రేషన్ కార్డుల మంజూరులో, వ్యవసాయ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయడంలో జాప్యం జరుగుతోందని తహశీల్దార్ ఆర్‌వి కృష్ణారావుకు తెలిపారు. పోడురు, కవిటం గ్రామాల సరిహద్దులో ఉన్న కాజా మేజర్ డ్రెయిన్‌లో తూడు తొలగించాలని, రెండేళ్లుగా డ్రెయిన్స్ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని, భారీ వర్షాలు కురిసినప్పుడు పంట చేలల్లోని నీరు లాగక చేలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎం.బలరామరాజు, వైస్ ఎంపిపి ఇందుకూరి సీతారామరాజు, సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - వీరవాసరం

యుటిఎఫ్ వీరవాసరం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో పలువురు యుటిఎఫ్ నాయకులు రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పిఎస్. విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య పాల్గొన్నారు. దీనికి సంబంధించి వివరాలు సోమవారం ప్రకటించారు. మండల కమిటీ గౌరవాధ్యక్షుడుగా కె.నాగముణేశ్వరరావు, అధ్యక్షులుగా జివి.రమణ, సహాధ్యక్షులుగా బి.అచ్చియ్య, జి.శ్రీలక్ష్మీ, ప్రధాన కార్యదర్శిగా ముద్రగడ శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎం.దుర్గారావు, కార్యదర్శులుగా ఏడుగురిని, ఇద్దరిని ఆడిట్ కన్వీనర్లను పంపన సాయిబాబు ప్రతిపాధించగా ఎస్.శ్రీరామచంద్రమూర్తి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

11న ఎంఆర్‌పిఎస్ జాయతీ మహాసభ

పాలకొల్లు: ఈనెల 11న బెంగళూరులో జరిగే ఎంఆర్‌పిఎస్ జాతీయ మహాసభను జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ గోదావరి జిల్లాల కన్వీనర్ పసుపులేటి చినబాబు కోరారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు పాలకొల్లు బెత్లెహం పేటలో సోమవారం కొండేటి వరదరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. జాతీయ ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మున్నంగి నాగరాజు ఆదేశాల ప్రకారం ఎంఆర్‌పిఎస్ నూతన యువ రక్తంతో కమిటీలు బలోపేతం చేయాలని చినబాబు కోరారు. చినబాబు మాట్లాడుతూ 11న బెంగుళూరులో తలపెట్టిన ఎంఆర్‌పిఎస్ జాతీయ మహాసభకు కొత్తగా ఎన్నికైన ఎంఆర్‌పిఎస్ గ్రామ, మండల కమిటీలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ యలమంచిలి మండల అధ్యక్షుడు ఉండ్రాజవరపు షేకర్ బాబు, పసల బోసు, కంకిపాటి రాధాకృష్ణ, బాలం నతానియేలు, పసల సన్నీ, పసుపులేటి సుమంత్ పాల్గొన్నారు.

కోడిపందేల బరులు ధ్వంసం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని వాలమర్రు, శివదేవుని చిక్కాల, వడ్లవానిపాలెం, చింతపర్రు, దగ్గులూరు, కాపవరం గ్రామాల్లో సంక్రాంతికి కోడిపందేల నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తున్న బరులను పాలకొల్లు రూరల్ పోలీసులు సోమవారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని యువత సాంప్రదాయ క్రీడల వైపు మొగ్గు చూపాలన్నారు. జూద క్రీడలకు దూరంగా ఉండాలని యువతకు పిలుపునిచ్చారు. సంక్రాంతి సందర్భంగా ఏ విధమైన కోడిపందేలకు పేకాట, గుండాటకు అనుమతులు లేవని, కోడిపందేల కోసం స్థలం ఇచ్చిన యజమానిపై కేసు నమోదు చేస్తామని, గతంలో కోడిపందేల్లో దొరికిన వారిని బైండ్ ఓవర్ చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

బరులను ధ్వంసం చేస్తున్న పోలీసులు

'సంక్షేమ పాలన చూసి ఓర్వలేకే విమర్శలు'

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తన వంతు సహాయం అందిస్తానని ఎంపిపి హెచ్‌డిఎస్ ఛైర్మన్ కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి) అన్నారు. సోమవారం జగన్ ప్రజా సంకల్ప యాత్ర నేటికీ నాలుగు శతాబ్దాలు పూర్తయిన సందర్భంగా పిహెచ్‌సిలో వైద్యాధికారిణిలు కె.లావణ్య, వై.అనూష ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు ప్రోటోనిక్స్, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాముడూరు సర్పంచి గూడూరి దేవేంద్రుడు, వైసిపి గ్రామ అధ్యక్షుడు తేతలి సుధీర్ రెడ్డి, నాయకులు చింతపల్లి గురుప్రసాద్, దాట్ల చంటిరాజు పాల్గొన్నారు.

ఆచంట : రాష్ట్రంలో వైసిపి సంక్షేమ పాలన చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని, రోజూ విమర్శలు, ఆరోపణలు చేస్తున్నాయని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్ పాదయాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి అభినందనలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు, ఎంపిటిసిలు ఉల్లం జ్యోతి రామానుజం, తప్పెట్ల విజయ కుమారి వెంకటరావు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు
మహారాజశ్రీ కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
G.W.O.P. No 49/2022

మైనర్లు/వారులు:
1) మైలాబత్తుల సాయి సత్య సురేష్, వయస్సు 17 సం॥లు, (పుట్టిన తేది: 02-08-2004), తండ్రి: దుర్గారావు, హిందూ, పురుషుడు, సంరక్షణ, విద్యార్థి, డోర్ నెం. 2-45/ఎ, రాజవరం, కొయ్యలగూడెం మండలం, ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం జెసిజెసి.
2) మల్లాబత్తుల దొర శ్రీ లక్ష్మి నాగ సూర్య నృశింహ సింధు, వయస్సు 15 సం॥లు, (పుట్టినతేది: 03-11-2006), తండ్రి: దుర్గారావు, హిందూ, స్త్రీ, సంరక్షణ, విద్యార్థి, డోర్ నెం. 2-45/ఎ, రాజవరం, కొయ్యలగూడెం మండలం, ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం జెసిజెసి.

Between:
1 శ్రీ మల్లాబత్తుల దుర్గారావు (ప్రతిపాదిత గార్డియన్), తండ్రి: సత్యనారాయణ, నివాసం: డోర్ నెం. 2-45/ఎ, రాజవరం, కొయ్యలగూడెం మండలం, ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం జెసిజెసి **-పిటీషనరు**
మరియు
1. -నిల్- **-రెస్పాండెంట్లు**

ఈ దిగువ షెడ్యూలు ఆస్తిలో మైనర్లు/వారులకు గల 2/3వ వంతు హక్కును, వారి చదువు, పోషణ, వగైరా అవసరముల నిమిత్తం విక్రయించుటకు గాను ప్రతిపాదిత గార్డియన్ అయిన మల్లాబత్తుల దుర్గారావు పిటీషనర్ పై నెంబరు గార్డియన్ ఓ.పి. నెం. 49/2022 ను దాఖలు చేసియున్నారు. ఇందుపై ఎవరికైనా ఏమైనా ఆక్షేపణలు/ అభ్యంతరములు వున్న యెడల సదరు పిటీషన్ వాయిదా **తేది. 14-02-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టులో హాజరై తెలియజేసుకొనవచ్చును.

షెడ్యూలు
ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం & సబ్ రిజిస్ట్రీ, గతంలో జంగారెడ్డిగూడెం పంచాయితీ, ప్రస్తుతం జంగారెడ్డిగూడెం మున్సిపల్ పరిధిలోని ఆర్.యస్. నెం. 567 రు, ప్లాట్ నెం. 21 రు దాఖలా డోర్ నెం. 10-50 రు గల ఇంటికి సమీపమున గల చ॥గ॥ 220లు స్థలమునకు హద్దులు.
తూర్పు: అ. 36'-0"లు ప్లాట్ నెం. 18 రు దాఖలా స్థలం.
దక్షిణం: అ. 55'-0"లు ప్లాట్ నెం. 22 రు దాఖలా స్థలం.
పడమర: అ. 36'-0"లు 33 అడుగుల వెడల్పు గల రోడ్డు.
ఉత్తరం: అ. 55'-0"లు ప్లాట్ నెం. 20 రు దాఖలా స్థలం.
ఈ హద్దుల మధ్య చ॥గ॥ 220 లు ఖాళీ స్థలము, ఇందలి సర్వం సహా, ఇందలి సమస్త ఈజుమెంటు హక్కులతో సహా.

ఏలూరి గోపాలకృష్ణ
పిటీషనరు తరపు న్యాయవాది
స్థలం: కొవ్వూరు కొవ్వూరు
తేది:27-12-2022 సెల్: 9441554144

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - అత్తిలి

మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 11వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వివివి ఎస్.రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఎంపిపి మక్కా సూర్యారావు, జెడ్‌పిటిసి సభ్యురాలు అడ్డాల జానకి ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

జనసేన ఆచంట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చేగొండి సూర్య ప్రకాష్ పుట్టినరోజు సందర్భంగా ఆచంట సిహెచ్‌సిలో రోగులకు సోమవారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం సూర్య ప్రకాష్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ శ్రీనివాస్, వైస్ ఎంపిపి ఎర్రగుప్పుల నాగరాజు, ఆచంట టౌన్ ప్రెసిడెంట్ నంబూరు విజయ్ పాల్గొన్నారు.

'చంద్రబాబుతో పవన్ జతకట్టడం సిగ్గుచేటు'

ప్రజాశక్తి - పాలకొల్లు

వంగవీటి రంగాను చంపిన చంద్రబాబు నాయుడుతో పవన్ కళ్యాణ్ జతకట్టడం సిగ్గుచేటని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ చెప్పారు. సోమవారం ఆయన కార్యాలయంలో మాట్లాడారు. పవన్‌కళ్యాణ్, చంద్రబాబు మధ్య ఉన్న బంధం బహిర్గతమైందని చెప్పారు. పవన్ కళ్యాణ్ ఎప్పటికీ ముఖ్యమంత్రి కాలేరని చెప్పారు. కులమత బేధాలకు అతీతంగా పరిపాలన చేస్తున్న జగన్ తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయమని చెప్పారు. ఈ సమావేశంలో వైసిపి నేతలు చెన్నూ విజయ్, రేలంగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోడూరులో జనసేన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - పోడూరు

గుమ్మలూరులో జనసేన కార్యాలయాన్ని జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి రావి హరీష్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అనంతరం వివేకానంద జయంతి సందర్భంగా ఈ నెల 12న రణస్థలం, శ్రీకాకుళం జిల్లాలో యువశక్తి బహిరంగ సభపోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. జనసేన మండల అధ్యక్షులు గుడాల రాజేష్ అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి రావి హరీష్ మాట్లాడుతూ గుమ్మలూరులో ఏ సమస్య ఉన్నా పరిష్కరించే దిశగా పోరాటం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ చిట్టూరి శ్రీనివాస్, జనసేన మండల అధ్యక్షులు జవాది బాలాజీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ భీమవరం 3వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో
E.A.No. 282/2022, E.P.No. 16/2019
in O.S.No. 34/2018

బిట్వీన్:
దారపురెడ్డి వీరాస్వామి **...క్లెయిమ్ పిటీషనరు**
అండ్
1) M/s. గాయత్రి ఆక్వాటెక్, ఆకివీడు, Rep. by. పార్టనర్ కలిగోట్ల సత్య వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు (డి.హెచ్.ఆర్)
2) దారపురెడ్డి కనకయ్య, తండ్రి: వీరాస్వామి, హిందూ, వయస్సు 55 సం॥లు, చినకాపవరం, ఆకివీడు మండలం (జె.డి.ఆర్)
...రెస్పాండెంట్లు

పై నెంబరు ఇ.పి.లో పిటీషనరు క్లెయిమ్ పిటీషన్ను దాఖలు చేసుకొనగా సదరు పిటీషనులో మీలో 2వ రెస్పాండెంటు అయిన దారపురెడ్డి కనకయ్య గార్కి ఎన్నిసార్లు కోర్టు నోటీసులు పంపించిననూ బుద్ధిపూర్వకంగా తీసుకొనక గ్రామంలో లేకుండా కాలయాపన చేయుచున్నారు. కావున సదురు పిటీషన్ను శ్రీ కోర్టు వారు **ది.06-02-2023 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. సదరు తేదీన మీరు ఉదయం గం॥10:30 ని॥లకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

జి.రోనాల్డ్‌రాజు
పి.జె.పి.కెనడి
అడ్వకేట్స్, బేతనిపేట,
భీమవరం, భీమవరం.
09-1-23. సెల్: 93473 04911

మహారాజశ్రీ భీమవరం 3వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో
E.A.No. 283/2022, E.P.No. 16/2019
in O.S.No. 34/2018

బిట్వీన్:
దారపురెడ్డి వీరాస్వామి **...క్లెయిమ్ పిటీషనరు**
అండ్
1) M/s. గాయత్రి ఆక్వాటెక్, ఆకివీడు, Rep. by. పార్టనర్ కలిగోట్ల సత్య వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు (డి.హెచ్.ఆర్)
2) దారపురెడ్డి కనకయ్య, తండ్రి: వీరాస్వామి, హిందూ, వయస్సు 55 సం॥లు, చినకాపవరం, ఆకివీడు మండలం (జె.డి.ఆర్)
...రెస్పాండెంట్లు

పై నెంబరు ఇ.పి.లో పిటీషనరు స్టే (Stay) పిటీషన్ను దాఖలు చేసుకొనగా సదరు పిటీషనులో మీలో 2వ రెస్పాండెంటు అయిన దారపురెడ్డి కనకయ్య గార్కి ఎన్నిసార్లు కోర్టు నోటీసులు పంపించిననూ బుద్ధిపూర్వకంగా తీసుకొనక గ్రామంలో లేకుండా కాలయాపన చేయుచున్నారు. కావున సదురు పిటీషన్ను శ్రీ కోర్టు వారు **ది.06-02-2023 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. సదరు తేదీన మీరు ఉదయం గం॥10:30 ని॥లకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

జి.రోనాల్డ్‌రాజు
పి.జె.పి.కెనడి
అడ్వకేట్స్, బేతనిపేట,
భీమవరం, భీమవరం.
09-1-23. సెల్: 93473 04911